క్లుప్తంగా

షిర్డీకి పాదయాత్ర

తుగ్గలి : వైఎస్సార్ కడప జిల్లా పులివెందుల నుంచి ప్రారంభమైన షిర్డీ సాయిబాబా భక్తుల పాదయాత్ర శుక్రవారం తుగ్గలి మీదుగా సాగింది. గురుదేవులు అమ్ముల సాంబశివరావు ఆశీస్సులతో ఈనెల 18న పులివెందులలో పాదయాత్ర ప్రారంభించామని 36 రోజుల పాటు 900 కి.మీ. సాగనుందని భక్తులు తెలిపారు. వచ్చేనెల 22వ తేదీ నాటికి షిర్డీ క్షేత్రం చేరుకుంటామని చెప్పారు.

కందుల కొనుగోళ్లు ప్రారంభం



మొలగవల్లిలో కొనుగోళ్లను ప్రారంభిస్తున్న మార్క్‌ఫెడ్,వ్యవసాయ శాఖ అధికారులు

ఆలూరు రూరల్: రైతులు ప్రభుత్వ కంది కొనుగోళ్ల కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఏడీఏ సునీత,నాఫెడ్ జిల్లా మేనేజర్ జయంత్ కుమార్,మార్క్ ఫెడ్ ఇన్‌చార్జ్ ప్రకాష్ రెడ్డి తెలిపారు. శుక్రవారం మండలంలోని మొలగవల్లి గ్రామంలో కందుల కొనుగోళ్లను ప్రారంభించారు. వారు మాట్లాడుతూ.. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎకరాకు 4,500 క్వింటాళ్లు కొనుగోలు చేస్తామన్నారు. సంచులను ప్రభుత్వమే అందిస్తుందని, విక్రయించిన రైతులకు ఖాతాల్లోకి నగదు జమ చేస్తామని చెప్పారు. ఆలూరు మార్క్‌ఫెడ్ సిబ్బంది కరుణాకర్, రైతులు ఉన్నారు.

సర్వేలు పూర్తి చేయండి



మాట్లాడుతున్న డీఎల్‌డీఓ అనురాధ

చిప్పగిరి: ప్రభుత్వం ఇచ్చిన సర్వేలన్నీ సకాలంలో పూర్తి చేయాలని మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, గ్రామ సచివాలయ సిబ్బందిని డీఎల్‌డీఓ అనురాధ ఆదేశించారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మిస్సింగ్ సిటిజన్, హౌస్ హోల్డ్, ఎంఎస్‌ఎంఈ సర్వేలతో పాటు ప్రభుత్వ ఆస్తులన్నీ జియో ట్యాగింగ్ చేయాలని సూచించారు. ఎంపీడీఓ అల్లాబకాష్, ఈఓపీఆర్డీ బాలన్న, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పకడ్బందీగా రీ సర్వే

కృష్ణగిరి: రీ సర్వేను పకడ్బందీగా చేపడుతున్నట్లు డీటీ లక్ష్మిరాజు తెలిపారు. మండలంలోని ఎరుకలచెరువు గ్రామంలో జరుగుతున్న రీ సర్వేను శుక్రవారం పరిశీలించారు.గ్రామంలో 4 వేల ఎకరాల భూమి ఉందని, ఇప్పటి వరకు 330 ఎకరాల్లో రీ సర్వే చేపట్టామన్నారు. ప్రతి రోజు రెండు టీంలు సర్వే చేస్తున్నాయని, రీ సర్వేకు సంబంధిత రైతులు సహకరించాలని కోరారు. వీఆర్వోలు వెంకటేశ్వర్లు, అయ్యన్న, సచివాలయ సర్వేయర్లు, రైతులు పాల్గొన్నారు.

నీటిసమస్య పరిష్కరించరేం?



సమస్యను వివరిస్తున్న కాలనీ మహిళలు

మద్దికెర : స్థానిక 19 వార్డు బెస్త వీధిలో ఆంజనేయస్వామి దేవాలయం వద్దనున్న కాలనీలో రెండు నెలలుగా నీరు రాక ఇబ్బందులు పడుతున్నామని, పలుమార్లు కోరినా సమస్యను పరిష్కరించడం లేదెందుకని కాలనీవాసులు లక్ష్మి, హనుమంతమ్మ, నెట్టికంటమ్మ తో పాటు 10 మంది మహిళలు శుక్రవారం ఈఓ శివకుమార్‌ను ప్రశ్నించారు. వారు మాట్లాడుతూ..రెండు నెలలుగా కుళాయిలు నీరు రాక ఇతర ప్రాంతాలకు వెళ్లి బోరు నీటిని తెచ్చుకుంటున్నామని వాపోయారు. ఈఓ మాట్లాడుతూ..కొన్ని రోజులుగా అభివృద్ధి పనులు జరుగుతుండడంతో పైపులు పగిలిపోతున్నాయని, వాటర్ సిబ్బందితో మాట్లాడి నీరు సరఫరా చేస్తామని చెప్పారు.

నీటి సమస్య పరిష్కారానికి చర్యలు

ఆస్పరి: గ్రామాల్లో నెలకొన్న మంచినీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు ఎంపీడీఓ గీతావాణి తెలిపారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ సుంకుర ఉమాదేవి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ గ్రామాలలో మంచి నీటి సమస్య తలెత్తితే తమ దృష్టికి తీసుకురావాలని సర్పంచులకు సూచించారు. బాల్య వివాహాలు చేస్తే చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. బాల్య వివాహాల నివారణకు తల్లిదండ్రులకు అవగాహన కల్పించేందుకు ప్రజా ప్రతినిధులు కృషి చేయాలన్నారు. నీటి సమస్య అధికంగా ఉందని తొగలుగల్లు, అట్టికల్లు సర్పంచులు అంజినయ్య, లత సభ దృష్టికి తెచ్చారు. ప్రస్తుతం ఉన్న బోర్లలో నీటి శాతం తగ్గిపోయిందని, కొత్త బోర్లు వేయించాలని కోరారు. అనంతరం విద్య, వైద్యం, విద్యుత్, ఉపాధి, వ్యవసాయం తదితర శాఖల పనితీరుపై ఆయా శాఖల అధికారులు వివరించారు. డాక్టర్ బాలకృష్ణారెడ్డి, డీటీ రామేశ్వరరెడ్డి,ఏఓ నరేంద్రకుమార్ పాల్గొన్నారు.

గురుకుల విద్యార్థినికి డెంగీ జ్వరం

వెల్దుర్తి: స్థానిక అంబేడ్కర్ గురుకుల విద్యాలయంలో 5వ తరగతి విద్యార్థిని రాణి డెంగీ జ్వరానికి గురైంది. సూదేపల్లి గ్రామానికి చెందిన ఈశ్వరయ్య కుమార్తె రాణి సంక్రాంతి సెలవులకు స్వగ్రామానికి వెళ్లి ఈనెల 21న గురుకులానికి చేరుకుంది. జ్వరంతో ఉండటం గుర్తించి తల్లిదండ్రులకు సమాచారమిచ్చారు. వారు శుక్రవారం స్థానిక సీహెచ్‌సీకి తరలించగా వైద్య పరీక్షల్లో డెంగీ లక్షణాలు ఉన్నట్లు తేలిందని ఆసుపత్రి సూపరింటెండెంట్ బాలచంద్రారెడ్డి తెలిపారు. తన పర్యవేక్షణలో చికిత్స అందిస్తున్నట్లు చెప్పారు.



పత్తికొండలో ఏళ్ల క్రితం నాటి ఊరువాకిలి లోపలి భాగం (ఫైల్)



ఊరువాకిలి వెలుపలి భాగం (ఫైల్)



ప్రస్తుతం ఊరువాకిలిగా పిలువబడే ప్రాంతం

ఆనవాళ్లు లేకున్నా.. అదే కేరాఫ్!

- ఏళ్ల నాటి ఊరు వాకిలి
- నేటికీ వినియోగంలో ఉన్న పేరు

ల్యాండ్‌మార్క్

కొన్ని ఆనవాళ్లు కోల్పోయినప్పటికీ వాటి ప్రత్యేకత, చారిత్రక నేపథ్యం మాత్రం చెక్కు చెదరదు. ఆ కోవలోకే వస్తుంది పత్తికొండ పట్టణంలోని ఊరువాకిలి. పూర్వం ఊరు వాకిళ్లకు ఎంతో ప్రత్యేకత ఉండేది. పట్టణంలో 160 ఏళ్ల క్రితం బ్రిటిష్ వారి హయాంలో రెండు ఊరు వాకిళ్లు నిర్మించారు. ఒకటి హోసూరు గ్రామ రోడ్డులో (ప్రస్తుతం సాయిబాబా మందిరం ముందు), మరొకటి సంతమార్కెట్‌కు వెళ్లే దారిలో ఉన్నాయి. కొండ పరిసర ప్రాంతంలో ఊరు ఉండటంతో క్రూర మృగాలు, దొంగల బారి నుంచి రక్షణ పొందేందుకు వీటిని నిర్మించారని పెద్దలు చెబుతారు. చీకటి పడగానే ఊరు వాకిళ్లు మూసేవారు. రాత్రి వేళల్లో ఊర్లో వెలుగు కోసం పెద్ద పెద్ద దివిటీలు (ఆముదం లాంతర్లు) వెలిగించేవారు. ఈ ఊరు వాకిలి బస్సు వెళ్లేంత మాత్రమే ఉండేది. ఇంతటి ప్రాముఖ్యత ఉన్న ఊరు వాకిళ్లను రోడ్డు విస్తరణలో భాగంగా తొలగించడంతో ప్రస్తుతం వాటి ఆ ఆనవాళ్లు కనిపించకుండా పోయాయి. 1996లో రోడ్డు విస్తరణలో ఊరు వాకిళ్లను తొలగించినప్పటికీ ఆ పేరు మాత్రం పోలేదు. ఇప్పటికీ అడ్రస్ చెప్పే క్రమంలో ఊరువాకిలి పేరు వినియోగిస్తున్నారు. ఆ ప్రాంతాన్ని ప్రస్తుతం ఊరువాకిలి సెంటర్‌గా పిలుస్తారు.

- పత్తికొండ(తుగ్గలి)

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి



మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవికి కృతజ్ఞతలు తెలుపుతున్న రామకృష్ణ

కృష్ణగిరి: నియోజకవర్గంలో పార్టీ కోసం పనిచేసిన వారికి సముతం స్థానం కల్పిస్తున్నామని మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అన్నారు. కృష్ణగిరి మండలం, సంగాల గ్రామానికి చెందిన కురువ రామకృష్ణను పత్తికొండ నియోజకవర్గ వలంటీర్ విభాగ అధ్యక్షుడిగా, అలాగే వెల్దుర్తి మండలం నుంచి యూత్ వింగ్ అధ్యక్షులుగా ఎన్నికైన నర్సింగ్ అశోక్‌కుమార్‌రెడ్డి శుక్రవారం మాజీ ఎమ్మెల్యేను కర్నూలులోని ఆమె నివాసంలో కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఆమె మాట్లాడుతూ ప్రతి మండలం నుంచి ఐదుగురికి కమిటీల్లో స్థానం కల్పించామన్నారు. వీరందరు కార్యకర్తలతో కలిసి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. గిడ్డయ్య, హనుమంతు, రామకృష్ణ, మధు, పెద్ద శివన్న, చిన్న మద్ది పాల్గొన్నారు.

అధికారం శాశ్వతం కాదు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న శశికళ

ఆలూరు: అధికారం శాశ్వతమని కూటమి నాయకులు మిడిసి పడుతున్నారని, హత్యలతో చెలరేగిపోతున్నారని, త్వరలోనే వాటన్నింటికీ అడ్డుకట్ట వేస్తామని వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు శశికళ, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్.కే.గిరి పేర్కొన్నారు. ఆలూరు మండలం అరికెర గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న కురుబ ఈరన్నను ఆదే గ్రామానికి చెందిన కొందరు టీడీపీ కార్యకర్తలు నరికి చంపడాన్ని ఖండించారు. ఆలూరు ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం కోసం తీసుకొచ్చిన మృతదేహాన్ని పరిశీలించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. అనంతరం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా హత్యలతో జనాన్ని భయభ్రాంతులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. ఇలాంటివి ఎక్కువ కాలం మనుగడ సాగించలేవన్నారు. జిల్లా ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘం అధ్యక్షుడు దేవేంద్ర, రాష్ట్ర కురుబ సంఘం ఉపాధ్యక్షుడు గుడిసె శివన్న, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మల్లికార్జున ఉన్నారు.

కందుల విక్రయానికి పేర్లు నమోదు చేసుకోవాలి



రిజిస్ట్రేషన్ ప్రక్రియను పరిశీలిస్తున్న ఏఓ రవి

మద్దికెర : ఖరీఫ్ 2024–25 సీజన్‌లో సాగు చేసిన కందులు విక్రయించదలచిన రైతులు సమీపంలో రైతు సేవా కేంద్రాల్లో పేర్లు నమోదు చేసుకోవాని ఏఓ రవి తెలిపారు. శుక్రవారం స్థానిక రైతుసేవా కేంద్రంలో రిజిస్ట్రేషన్ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం క్వింటా ధర రూ.7,550 నిర్ణయించిందన్నారు. ఎకరాకు 4 క్వింటాళ్ల చొప్పున మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేస్తారని చెప్పారు. కందులను అమ్ముకోదలచిన వారు తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలని, అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల చెప్పారు. వీఏఏ జాకీర్ పాల్గొన్నారు.

కందుల కొనుగోలుకు రిజిస్ట్రేషన్ తప్పనిసరి

పత్తికొండ రూరల్ : రైతులు సాగు చేసిన కందులను మద్దతు ధరతో కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించిందని, ఇందుకు రైతులు స్థానిక రైతు సేవా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి వెంకట్రాముడు తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ కందులు క్వింటా రూ.7,550 ప్రకారం ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించిందన్నారు. మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాల్లో కందుల కొనుగోలుకు మ్యాపింగ్ చేసినట్లు తెలిపారు. రైతులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మార్కెట్ సముదాయం పరిశీలన



మార్కెట్ కాంప్లెక్స్‌ను పరిశీలిస్తున్న నాబార్డు ఏపీ ఏజీఎం ఖలీల్ అన్సర్

మద్దికెర : స్థానిక ప్రధాన బజారులో నాబార్డు నిధులతో నిర్మించిన కూరగాయల మార్కెట్ సముదాయాన్ని నాబార్డు ఆంధ్రప్రదేశ్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ ఖలీద్ అన్సర్ శుక్రవారం పరిశీలించారు. గ్రామీణ ప్రాంతాలను అభివృద్ధి చేసేందుకు నాబార్డు సహకారం అందిస్తుందని సద్వినయోగం చేసుకోవాలని సూచించారు. జిల్లా ఏజీఎం సుబ్బారెడ్డి, సర్పంచ్ బండారు సుహాసిని, మాజీ సర్పంచ్, దాత కొత్తపేట వెంకటేశ్వరరెడ్డి, బండారు ఆంజనేయులు ఉన్నారు.

పంచాయతీ భూమి పరిశీలన

సాక్షి ఎఫెక్ట్

ఆలూరు: స్థానిక పంచాయతీకి చిప్పగిరి మండలం రామదుర్గం గ్రామంలో సర్వేనంబర్ 484 లో 32.20 ఎకరాల మెట్టపొలాన్ని పట్టణ కేంద్రానికి చెందిన భాస్కర్‌శెట్టి(రావు) 1954లో నూతనంగా ఏర్పడిన పంచాయతీకి దారదత్తం చేశారు. అయితే ఆ భూమిని కొందరు ఆక్రమించి పంటలు సాగు చేసుకుంటున్నారు. ఈ ఆక్రమణను ఈనెల17న సాక్షి దినపత్రికలో ‘పంచాయతీ స్థలం పరులకు ఆదాయం’ శీర్షికన కథనం ప్రచురితమైంది. దీంతో ఆలూరు ఈఓ వై.ప్రభాకర్, జూనియర్ అసిస్టెంట్ వినోద్‌కుమార్, బిల్ కలెక్టర్ వరుణ్‌కుమార్ శుక్రవారం ఆ భూమిని పరిశీలించి అక్రమార్కులపై ఆరా తీశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామని వారు చెప్పారు.

సద్వినియోగం చేసుకోండి

కృష్ణగిరి: గ్రామాల్లో నిర్వహిస్తున్న పశు ఆరోగ్య శిబిరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని వైద్యాధికారి నవీన్‌కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం ఎరుకలచెరువు గ్రామంలోని రైతు సేవా కేంద్రం వద్ద ఈ శిబిరాన్ని సర్పంచ్ ప్రవీణ్‌కుమార్ కలిసి ప్రారంభించారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

హొళగుంద: మండలంలోని ముద్దటమాగి గ్రామంలో శుక్రవారం సీసీ రోడ్డు, డ్రైన్ల నిర్మాణానికి భూమి పూజ నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ షఫివుల్లా, జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్కే గిరి, నాయకులు కోగిలతోట శేషప్ప, రమేష్, ఈఓపీఆర్డీ చక్రవర్తి తదితరులు రూ.5 లక్షల జెడ్పీ నిధులతో సీసీ రోడ్డు నిర్మాణాన్ని శుక్రవారం ప్రారంభించారు.

చిప్పగిరి:మండలంలోని ఏరూరు గ్రామంలో రూ.10 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులు శుక్రవారం ప్రారంభించినట్లు సర్పంచ్ తిమ్మాపురం వెంకటలక్ష్మి తెలిపారు.

నూతన ఏపీఓగా యేసురత్నం

దేవనకొండ: ఉపాధి హామీ మండల నూతన ఏపీఓగా యేసురత్నం నియమితులయ్యారు. ఇక్కడ పనిచేస్తున్న ఏపీఓ కృష్ణమూర్తి ఆదోనికి బదిలీ అయ్యారు. శనివారం యేసురత్నం బాధ్యతలు చేపట్టనున్నారు.

14 ఏళ్ల తర్వాత హత్యాకాండ

ఆలూరు: కురుబ ఈరన్న హత్యతో అరికెర గ్రామం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. 14 ఏళ్ల తరువాత మళ్లీ హత్య రాజకీయాలు మొదలవడంతో జనం భయాందోళన చెందుతున్నారు. 2010 మే 15న గ్రామానికి చెందిన బోయ గోపాల్ హత్యకు గురైయ్యాడు.నాడు కొందరు నాయకులు ఇరువర్గాల మధ్య సయోధ్య కుదర్చడంతో ఫ్యాక్షన్ కనుమరుగైంది. ప్రశాంతంగా ఉన్న గ్రామంలో ఫీల్డ్ అసిస్టెంట్‌గా కురుబ ఈరన్న (43) రాజీనామా చేయాలని కూటమి నేతల అనుచరులు ఒత్తిడి చేశారు. అది చివరకు హత్యకు దారితీసింది. శుక్రవారం గ్రామాన్ని పత్తికొండ డీఎస్పీ బి.వెంకటరామయ్య సందర్శించి పరిస్థితిని సమీక్షించారు.

ఆలయంలో చోరీ

తుగ్గలి : గుర్తు తెలియని వ్యక్తులు ఆలయంలో చోరీకి పాల్పడిన ఘటన గురువారం అర్ధరాత్రి జొన్నగిరిలో చోటుచేసుకుంది. గ్రామ చెరువు కట్ట వద్దనున్న నెల్లూరమ్మ ఆలయంలో హుండీ తాళాలు పగులగొట్టి చోరీకి పాల్పడ్డారు. హుండీలో ఉండే దాదాపు రూ.20వేలను దొంగలు అపహరించుకెళ్లారని గ్రామస్తులు తెలిపారు.

హక్కులను హరిస్తున్న ప్రభుత్వాలు

పత్తికొండ రూరల్ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల హక్కులను కాలరాస్తున్నాయని సీపీఎం మండల కార్యదర్శి చక్రాళ్ల వెంకటేశ్వరరెడ్డి విమర్శించారు. శుక్రవారం స్థానిక ఈశ్వరరెడ్డి భవన్‌లో ప్రజాసంఘాలు, ప్రజానాట్యమండలి సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈనెల 26వ తేదీన ఏఐకేఎస్, వామపక్షాలు, ప్రజాసంఘాల పిలుపు మేరకు రైతులు పండించిన పంటకు మద్దతు ధర, ప్రైవేటీకరణ, నిరుద్యోగం, కార్మిక, కర్షకుల సమస్యల పరిష్కారం కోసం దేశవ్యాప్త నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. సీఐటీయూ కార్యదర్శి గోపాల్, ప్రజానాట్యమండలి జిల్లా నాయకుడు కాశీనాథ్, మండల అధ్యక్ష, కార్యదర్శులు కాశీ, రమేష్, తిమ్మప్ప, శివశంకర్ పాల్గొన్నారు.

తల్లిదండ్రుల ఆశయాలు నెరవేర్చాలి



మాట్లాడుతున్న ఆర్డీఓ భరత్‌నాయక్

పత్తికొండ రూరల్ : విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలని ఆర్డీఓ భరత్‌నాయక్ అన్నారు. శుక్రవారం స్థానిక డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో యువ స్పందన స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో జాతీయ బాలిక, అంతర్జాతీయ విద్యాదినోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆర్డీఓ, ఎంపీడీఓ సువర్ణలత, పత్తికొండ సీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ కల్పన హాజరయ్యారు. అనంతరం ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరంలో ఉత్తమ ప్రతిభ కనపరచిన కీర్తి, చాంద్‌బీ, దేవమణిని అభినందించారు.

దేవర నిర్వహణకు విరాళం

చిప్పగిరి: హొళగుంద మండలం కేంద్రంలోని ఆయోధ్య నగర్‌లో గ్రామ పెద్దల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మహంకాళీ అమ్మవారి దేవర కార్యక్రమానికి ఎమ్మెల్యే బి.విరూపాక్షి శుక్రవారం రూ.10వేలు విరాళంగా అందజేశారు. చిప్పగిరిలోని తన నివాసంలో దేవర నిర్వాహకులు తనను కలవడంతో ఆ మొత్తాన్ని వారికి అందజేశారు.

బాలికలు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలి

మద్దికెర : బాలికలు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలని ప్రభుత్వ వైద్యాధికారులు రాగిణి, శ్రీలక్ష్మి అన్నారు. శుక్రవారం బాలికల దినోత్సవం సందర్భంగా స్థానిక కస్తూరిబా విద్యాలయంలో సమాజంలో బాలికల సంరక్షణ, హక్కులు, ఆరోగ్యం, విద్య, సామాజిక ఎదుగుదల అంశాలపై అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ ఆడపిల్లల పట్ల వివక్ష చూపరాదన్నారు. లింగ వివక్షతను, గర్భస్థ లింగ నిర్ధారణ పద్ధతులను వ్యతిరేకించడమే గాకుండా బాలికల మనుగడకు ఎదరయ్యే ఎటువంటి ఆటంకాలనైనా నిరోధించాలని కోరారు. హెల్త్ ఎడ్యుకేటర్ అక్బర్‌బాషా, సీహెచ్‌ఓ నిరంజన్‌బాబు, ప్రిన్సిపాల్ జ్యోతి పాల్గొన్నారు.

ఓటరన్నకు వందనం

- నియోజకవర్గంలో ఓటర్ల సంఖ్య 2,24,374 మంది
- నేడు ఓటర్ల దినోత్సవం



పత్తికొండ రూరల్ : పాలకులను ఎన్నుకునే ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటర్లే దేవుళ్లు. అలాంటి ఓటర్ల ఆవశ్యకతను తెలియజేసేందుకు గుర్తుగా ఏటా జనవరి 25వ తేదీన జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. నియోజకవర్గానికి సంబంధించి ఓటర్ల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు.

ర్యాలీని జయప్రదం చేయాలి



జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం పత్తికొండలోని ప్రభుత్వ డిగ్రీకళాశాల నుంచి అంబేడ్కర్ కూడలి మీదుగా నాలుగు స్తంభాల కూడలి వరకు యువతీ, యువకులతో ర్యాలీ నిర్వహిస్తాం. ర్యాలీలో ప్రతి ఒక్కరూ పాల్గొని జయప్రదం చేయాలి. 18ఏళ్లు నిండిన యువతీ, యువకులు తప్పకుండా ఓటు హక్కు నమోదు చేసుకోవాలి. – భరత్‌నాయక్, రెవెన్యూ డివిజనల్ అధికారి, పత్తికొండ

నూతనంగా ఓటు హక్కు నమోదు చేసుకున్న అర్హులైన ఓటర్లకు ఎపిక్ కార్డులు ఇంటికే పంపుతున్నారు. రానున్న ఎన్నికల్లో తప్పకుండా ఓటింగ్‌లో పాల్గొనేలా వారిలో చైతన్యం తీసుకొచ్చేందుకు అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. ఈనెల 6వ తేదీ నాటికి చివరి పబ్లికేషన్‌తో నియెజకవర్గంలో 2,24,374 మంది ఓటర్లు ఉన్నారు.

మండలాల వారీగా ఓటర్ల వివరాలు..

మండలం	పురుషులు	స్త్రీలు	ట్రాన్స్‌జెండర్స్	మొత్తం
కృష్ణగిరి	18,654	18,255	0	36,909
మద్దికెర	14,599	15,091	3	29,693
పత్తికొండ	28,110	28,991	9	57,110
తుగ్గలి	24,898	24,641	6	49,545
వెల్దుర్తి	25,661	25,452	4	51,117
మొత్తం	1,11,922	1,12,430	22	2,24,374

యువ ఓటర్లు..

18–19 సంవత్సరాల మధ్యన యువ ఓటర్లు 2,085 మంది కాగా యువతులు 1,428 మంది, ట్రాన్స్ జెండర్స్ ఒకరితో కలిపి మొత్తం 3,514 మంది నమోదు చేసుకున్నారు. వంద సంవత్సరాల పైబడిన వృద్ధులు 12 మంది కాగా పురుషులు 3, మహిళలు 9 మంది ఉన్నారు.

ప్రజాస్వామ్యానికి ఓటు పునాది



తహసీల్దార్ కార్యాలయంలో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఆలూరు ఎలక్టోరల్ ఆఫీసర్ గోవింద్ సింగ్

ఆలూరు రూరల్: ప్రతి పౌరుడు తప్పని సరిగా ఓటు హక్కు వినియోగించుకుని, ప్రజాస్వామ్య పరిరక్షణలో భాగస్వాములు కావాలని ఆలూరు అసెంబ్లీ అసిస్టెంట్ ఎలక్టోరల్ ఆఫీసర్ గోవింద్ సింగ్ అన్నారు. ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ విజయ్ కుమార్, ఎన్నికల డీటీ దీపా వీఆర్వోలు ఉన్నారు.

హొళగుంద: ఓటు అనే ఆయుధంతో నవ సమాజాన్ని నిర్మించుకోవాలని డిప్యూటీ తహసీల్దారు నిజాముద్దీన్ పిలుపునిచ్చారు. శనివారం జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా శుక్రవారం తహసీల్దారు కార్యాలయం ఎదుట వీఆర్‌ఓ, వీఆర్‌ఏలతో డీటీ, స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ ప్రవీణ, అధ్యాపకులు విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు.

వెల్దుర్తి: ఓటరు దినోత్సవం సందర్భంగా స్థానిక కార్యాలయంలో ఎంపీడీఓ సుహాసిని, ఈఓఆర్డీ రవి కిశోర్, పీఆర్ ఏఈ మల్లికార్జున, ఎన్‌ఆర్‌ఈజీఎస్ సిబ్బందితో కలిసి తన కార్యాలయం ఎదుట ప్రతిజ్ఞ చేయించారు.

స్కూల్ కాంప్లెక్స్‌ను కొనసాగించాలి



కర్నూలులో విద్యాశాఖ కమిషనర్ సురేష్‌కు సమస్యను వివరిస్తున్న ఇంగళదహాళ్‌వాసులు

హొళగుంద: ఇంగళదహాళ్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను స్కూల్ కాంప్లెక్స్‌గానే కొనసాగించాలని ఆ గ్రామపెద్దలు కోరారు. ఈమేరకు శుక్రవారం కర్నూలుకు వచ్చిన రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్ సురేష్, డీఈఓ శ్యాముల్ కలిసి వినతి పత్రం అందజేశారు. గ్రామపెద్దలు వెంకట్రామిరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, ఎంపీటీసీ మల్లికార్జున, పీఎంసీ చైర్మన్ ఉరుకుంద తదితరులు మాట్లాడారు. పరిశీలించి కాంప్లెక్స్‌ను యథావిధిగా కొనసాగిస్తామని హామినిచ్చారని చెప్పారు. అలాగే..సుళువాయి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సమస్యలను పరిష్కరించాలని గ్రామపెద్దలు కమిషనర్‌ను కోరారు. పీఎంసీ చైర్మన్ నట్టిప్ప, గ్రామపెద్దలు రాఘవేంద్ర, సీతయ్య, పంపారెడ్డి తదితరులు వినతి పత్రం అందజేశారు.

పెనుమాడ గ్రామాన్ని కమ్మేసిన పొగమంచు



బ్రిడ్జి కనిపించనంతగా..



ప్రభాత వేళ.. హిమసోయగం



భానుడిని బంధించిన పొగమంచు

కృష్ణగిరి: చలి తీవ్రత పెరగడంతో ప్రభాతవేళ పొగమంచు తీవ్రంగా కురుస్తోంది. పొగమంచులో నింగి, నేల ఒక్కటైనట్టు కనిపించే దృశ్యాలు ఆహ్లాదకరంగా ఉంటున్నాయి. ఇక తెల్లవారుజామున పల్లెలో వాకింగ్‌కు, పొలం పనులకు వెళ్లేవారు ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని పెనుమాడ, కంబాలపాడు, సంగాల, చుంచుఎర్రగుడి తదితర గ్రామాల్లో శుక్రవారం ఉదయం 8:30 గంటల వరకు కూడా పొగ మంచు తీవ్రత తగ్గలేదు. అప్పటి వరకు భానుడి కిరణాలు కనిపించలేదంటే తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. ఆయా గ్రామాల్లోని మార్గాల్లో రాకపోకలకు వాహనదారులు ఇబ్బంది పడ్డారు. కాగా..మంచు వల్ల మామిడి పూత దెబ్బతినే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



పొగమంచులోనే ఆటోలో వ్యవసాయ ఉత్పత్తుల తరలింపు